
# వారసత్వం



మంథా వెంకట రమణ రావు కథ

బస్‌స్టాండ్ దగ్గరి మెయిన్ రోడ్డుమీద, సైడ్ కాలవ పక్కన ఒక ముష్టివాడి శవం పడుంది. రాత్రి ఎప్పుడు చచ్చేడో ఏమో, అప్పుడే బాడీ డీకంపోజయింది. ఆ వాసనకి ఈగలు జోరుగా ఆ శవం మీద మూగుతున్నాయి ఆనందంగా ఈల వేసుకుంటూ-

ఒంటి మీద గోనె కప్పి ఉంది. రాత్రి చలి బాధనుంచి తట్టుకుందుకు, దానే కంబళిగా కప్పుకుని ఉంటాడు.

ఉదయం తొమ్మిదయింది. జనాలు ఎవరి పనులమీద వాళ్లు ఉరుకులూ పరుగులూతో వస్తున్నారు, వెళ్తున్నారు. బస్‌స్టాండాయెమరి. అక్కడ పట్నం పెద్ద బజారు కూడా ఉందాయె.

ఎవ్వరూ అక్కడో శవం పడుందని కూడా గమనించడం లేదు. ఆముష్టివాడు లేచి కూర్చొని; "బాబూ! ధర్మం! అమ్మా! దర్మం!" అంటూ తనవంటి మానవుల సేవ చెయ్యడమే పరమధర్మం అని జోరుగా అరుస్తే, ఎందుకూ పనికిరాని పదిపైసలూ, ఐదుపైసల నాణేలున్నవాళ్లు వాటిక్కడ వదేసి మానవసేవ చేసామనుకొని తృప్తిపడుతూ ఓ సెకెండు కాలం గమనించి ఉంచారు-

ఏంరోగం వచ్చిందో మరి- రక్తం కక్కుకున్నట్టుంది- నేలమీద రక్తపు చారలు- అక్కడ ఈగలు- అతడు బతికుండేటప్పుడు అతడి పంక్తిలో కూర్చొనే సహోద్యోగులు ఇప్పుడక్కడ లేరు. ఆ వాసన భరించలేక దూరంగా పోయేరు. శవం ఎప్పుడు లేస్తుందా, ఎప్పుడు అక్కడ కూర్చుందామా అని దూరంనించే గమనిస్తూ-

నార్మల్‌గా చచ్చుంటే బెగ్గర్లంతా కలిసి వచ్చీపోయే జనాల దగ్గర చందాలు పోగేసి ఉందురు మాల్లా. శవానికి బంతిపూల హారాలువేసి, అగర్రవత్తులు వెలిగించి, చిడతలు వాయిస్తూ భజన కార్యక్రమం రోజల్లా నడుచును- కనీసం రెండొందలన్నా పోగవును.

కాని రక్తం కారి ఉండడం వల్ల, పోలీసు కేసవుతుందేమోనన్న భయంతో, బెగ్గరోళ్లవళ్లూ ఆ ఛాయలకి పోలేదు.

అంతలో లోకల్ మున్సిపల్ కౌన్సిలర్ ఆదారంట పోతూ, శవం వాసన తగలడం వల్ల టక్కున స్కూటరాపి, అక్కడున్న బీటు కానిస్టేబులును కేకేసి అడిగేడు.

"పోలీస్! ఎవురిదీ శవం?"

"బెగ్గరోడిది బాబూ!"

"ఎప్పట్నించి పడుంది?"

"నాను డ్యూటీ కొచ్చినకాడ్నించి చూస్తున్నానండి!"

"మరి తీయించలేదేం?"

"యిది పోలీసు కేసుగాదండి- రోగమొచ్చి రక్తం గక్కుక సచ్చినట్టున్నాడు!"

"మరెవుడు తీయిస్తాడనుకున్నావ్?"

"మరెవరుబాబూ! తఁవరు!"

"చమించాలి! తఁవరంటే మున్సిపాలిటీవేల్లండి!"

"అలాగనుకోనుండు.. నీ ఉజ్జోగమూడుద్ది! మరోగంటలో ఓ మంత్రిగారీ రోడ్డుమీదెల్తారు..."

"అల్లకి బెగ్గరోడగపిస్తాడేటిసార్? యీడమ్మ యీడ్నీడనే కని సచ్చింది. అప్పటికాడ్నించి యీడనే పెరిగి పెద్దోడయినాడు- యీడనే కూకొని ఆడు బిచ్చమెత్తుకున్నప్పుడు యీ రోడ్డెంబడి యెందరో మంత్రులు, ముక్కమంత్రులు యెల్లినారు.. గాని ఎవురూ 'ఏరా? యిక్కడేటి జేస్తున్నావ్' అని అడగనేదండి. మరిప్పుడెందుకడుగుతార్‌సార్?"

"ఒరే సింవాసెలం! నీపేరు సింవాసెలవేనా? కాదు అప్పలసామా? ఒరప్పలసామీ...! బతుకున్న బెగ్గరోడు పరవాలేదు కాని సచ్చిన బెగ్గరోడు సానా ప్రెమాదం నాయనా! ఆశవం అలా పడుంటే ఆకల్చావులని జెప్పి ఎగస్పార్టీవోళ్లు ఎసెంబ్లీలో ఎసరు పెడితే ప్రెభుత్వమే గోవిందా అయిపోద్ది! నివ్వురవ్వ అంటుకున్నతంటే కొండే పేలిపోద్ది!

స్వీపరోల్లని పిలిసి రోడ్డు క్లియర్జేయించు!"

"అట్టనేసార్! తంవరం సెపఫడవూ మాం కాదండమంనా!"

అక్కడే మార్కెట్ రోడ్లు మంత్రి గారొస్తారని మూడోసారి క్లీన్ చేస్తున్న నలుగురు స్వీపర్లని కేకేసుకొచ్చేడు అప్పలసామి.

"క్లియర్ సెయండిరి శవాన్ని- మంత్రిగోరు పారొస్తన్నారు" పోలీసు జారీచేసేడు.

"కుంటినంజకొడుకు సచ్చేడు- రోడ్డంతా రగతం గూడ! యేం కానిస్టేబులు బాబూ! తాగడానికి డబ్బులిస్తేకే గాని శవంని ముట్టం!"

"ఏట్రా? పోలీసోడి జోబుకే బొక్కేడదామనుకుంటన్నార్రా? బుద్ధిగా శెవాన్నెత్తుతారా, టేసనుకి నడుస్తారా? కల్లు నెత్తిమీది కెక్కినాయంటరా?"

స్వీపర్లు నడిగేరు - తలలు గోక్కున్నారు- "యాడకొట్టేల్లమంటావ్? కాల్చడానికి కర్రలేయీ? సిల్లర మల్లర కర్సులకి డబ్బులేయీ?"

"అనాసరంప్రెసంగం సెయ్యమాక! యీ శవాన్ని మోసుకెల్లి, గొయ్యి తీసి పాతేసిరండి... స్మసానం కాడ కల్లుపాకుంది గందా యీరాసామిది- నాన్సెప్పినానని జెప్పి తలో గళాసు యెక్కించండి!"

"ఆడు కాదంటేనో!"

"కాదంటే నాపద్దులో రాస్కోమను!"

"సంతకి సిటీ నచ్చికి గాజులు నాగుంది ఎవ్వారం! కానీండి, మరి తప్పుద్దా!"

స్వీపర్లు వెళ్ళి తాళ్లు తెచ్చేరు - ఆ చేకుతాళ్ళు చచ్చిన గొడ్లని మోసిమోసి గట్టి పడ్డాయి, నల్లపడ్డాయి-

"నంజకొడుకు! సచ్చినచ్చి ఇయ్యాలే సవ్వాలా?" ఒకడనాడు-

'సవ్వాలని సచ్చేడంటరా? ఆడిక్కాలం మూడింది ఆడు సచ్చేడు!"

"యీడికి పెల్లం, పిల్లలు నేరంటావా సన్నాసీ?"

"యాడనో ఉండే ఉంటరు - మడిసై పుట్టినాక పెల్లాం పిల్లలు ఉండక మానతారా?"

"యీడు కూడ పెట్టిందంత యాడన్నాసిండో?"

"యీల్లకి బేంకుల కాతాలు గూడ ఉంటయ్యంట - దాసుంటడు.."

"యేటినాబం? యేపూట గడింసిం దాపూటే కరుసెట్టెయ్యాల - అప్పుడే మజా! దాసిపెడితే మరెవుడో అనుబగిస్తా..!"

"పేడపురుగు మసానం ఉండ జుట్టినట్టు యీ డబ్బునోల్లంత సచ్చులూ, కోట్లూ దాసిపెడతారే మన కడుపులు గొట్టి? యెప్పుడు తిన్ను మావాఁ!"

"ఆడి ముండలూ, ఆడి కొడుకులూ సుకపడతరు..ఆడి కొడుకుల పెల్లాలూ, ఉంపుడు కత్తెలూ సుకపడతరు!"

"ఊరందర్నీ దోసి ఒకడు సుకపడ్డం అన్నేయం కదా మావాఁ? తాగుదమంటే రూపాయి డబ్బులేవు నాకాడ! యీ సచ్చినోడ్ని మోసినందుకన్నా సుక్కకి దిక్కులేదు!"

కబుర్లాడుతూ చచ్చినోడి చుట్టూ తాళ్లుకట్టి ఆ తాళ్ల మధ్యనించి పెద్ద వెదురు బొంగు దూర్చి శవాన్నెత్తి, బొంగుని భుజాల కెక్కించి మోసుకుపోయేరు - మరో స్వీపరొచ్చి ఫినయిలు జల్లి, నీళ్లుపోసి ఆ జాగా శుభ్రపరిచేడు - చచ్చిన ముష్టివాడి పింగాణీ చిప్పని తీసి చెత్తల డొక్కులోకి విసిరేసేడు-

వెంటనే ఆ జాగాని మరో ముష్టివాడు ఆక్రమించేడు -ముష్టివాడి ఉద్యోగం కాళీ అవడమేమిటి ఆ ఉద్యోగం వెంటనే భర్తీ అయిపోయింది-

"ఎవడ్రా నువ్వు! కదులిక్కడ్నించి!" పోలీసు లాఠీని ఝుళిపించేడు-

"నాను బతికున్న బెగ్గరోడ్ని సార్! నానెవురి కంటాబడను! మంతిరి గోరుకి బెగ్గరోల్లున్నారని తెల్దులే పోలిసు బాబూ! దేశంలో దరిద్రంనేదూ, అంతా డబ్బున్నోల్లయి పోనారని ఆ బాబులంటున్నారు గందా"

"నీ పేరేట్రా?" పోలీసడిగేడు.

"బెగ్గరోడు బాబూ!"

"నీ అయ్యపేరు?"

"ఆడిపేరు బెగ్గరోడేనండి!"

"బెగ్గరోడి కొడుకువి బెగ్గరెలాగయ్యేవ్? ఆడి పొస్టు నీకెవడిచ్చేడ్రా! అది బంధుప్రీతి! అవినీతి! తండ్రి పోస్టుకొడుక్కివ్వం! నువ్వు బెగ్గర్వి కాక మరెవడివీ ఎందుకవలేదు?" పోలీసు రొఖ్ఖాయించేడు-

పక్కని నిల్చొని ఎప్పటికీ రాని బస్సుకోసం పడిగాపులు పడుతున్న ఓ పెద్దమనిషి కలుగజేసుకున్నాడు- "ఏమయ్యా కానిస్టేబులు! బెగ్గరోడి కొడుకు బెగ్గరోడవక మరేటవుతాడంటావ్?"

"అయితేసార్! నాకొడుకు కానిస్టేబులే అవతాడా? ఆఫీసరవడా?"

"అవడయ్యా! అయితే కానిస్టేబుల్.... లేపోతే లోఫరవుతాడు!"

"నాకొడుకు పెసిడెంటు పదవికి పోటీ చెయ్యొచ్చు గందా సార్?"

"చెయ్యొచ్చు! కాని వాడికి పొరపాటున తప్ప ఒక్క ఓటు పడదు! ఓ రహస్యం చెపుతాను విను! యీ దేశంలో ఎక్కడో నూటికో కోటికో తప్ప, ఎవడి కొడుకు వాడవుతాడు!"

"అదెట్టాబాబూ?"

"ప్రతోడికి పవరుంటుంది... ఒప్పుకుంటావా? బెగ్గరోడికి బెగ్గరంత పవరు- రిక్షావోడికి ఆడంతే పవరు... కానిస్టేబులికి.. ఆవగింజంత గోర్మెంటు పవరు.. మినిస్టరోడికి గుమ్మడికాయంత పవరు.. రాజుకి రాజ్యమంత పవరు! ఆపవరు అంతకన్న ఎక్కువ పవరవదు-"

"ఎందుకవదుసార్! నాకొడుకు కాలేజిల సదివి. ఐ.ఏ.ఎస్ పరీచ్చ రాసి కలట్టరవడంటారా?"

"అవడయ్యా! అయ్యనే అనుకరిద్దామనిజూస్తారు పిల్లలు- నువ్వు కొడుతున్న సెల్యూట్‌లూ, నువ్వు తింటున్న లంచాలూ, పేదోళ్లమీద నీ జులుం నీకొడుకులకి ఆదర్శం- ఆడు నీలాగే అవుతాడు- బెగ్గరోడు కొడుకుని చదివించగల్డా? ఆడికయిదేళ్లు రాంగానే ముష్టి చిప్పిచ్చి కూచోపెడతాడు! కలక్టరు బాబు ఆడి పవర్లో కొడుకుని కలక్టర్

జేస్తాడు- డాక్టరు ఆడి కొడుకల్ని డాక్టర్లుగా జేస్తాడు, కూతుళ్లనీ జేస్తాడు లేకపోతే డాక్టర్లకిచ్చి పెళ్లి జేస్తాడు!"

"అదేటి బాబు! తవరు సూడబోతే ఒక్కపాలిగా నన్ను నర్దేటవమంచేస్తున్నారు!" పోలీసు ముఖం వాడిపోయింది-

"అదంతేరా నాయనా! సినిమావోడు ఆదేశం పిల్లలకప్పు జెప్పటంనేదా? హీరో కొడుకు హీరో.. హీరోయిన్ కూతురు హీరోయిన్! అదే ఎగబడి జూస్తన్నరు జనం! ఔనా కాదా? డవిరెట్టరు కొడుకు డవిరెట్టరు- ప్రొడ్యూసరు కొడుకు ప్రొడ్యూసరు... మంత్రి కొడుకు మంత్రి! రాజు కొడుకు రాజు!"

"ఎవడి పవర్ని ఆడొదలకుండ వారసుల కప్పుజప్పేస్తరంట?"

"యిప్పటికి గేనం కలిగిందా ఎంకటసామీ? ఏ బలుబు పవరుతో ఆ బలుబెలుగుద్ది! అంత కన్నెక్కువ పవరుత ఎలగదు- అందువల్ల ఆ సచ్చిన బెగ్గరోడి చోట యీ బెగ్గరోడ్ని తీసుకోనీ! అది రూలే! నీకు డౌటుంటే మంత్రిగోర్నాపి పెశ్నించు! ఆరూ అదేనంటారు-"

"అయితే సార్! మంత్రి బెగ్గరోడవొచ్చుగందా? లచ్చాధికారి బిచ్చాదికారవొచ్చుగదా? దానికేటంటారు?"

"అవొచ్చు! కర్మగుడిసేటిదయితే అవుద్ది తప్ప అలాగెప్పుడూ అవదు-"

"మంత్రి పదవూడతేనండి?"

"ఊడితే ఆడు ఎగస్పార్టీలో చేరి పదవూడకొట్టిన వోడికెసరెడతాడు- ఆడు ఎసరెట్టకుండ మంత్రి పోస్టులో ఉన్న వాడాడికి సెల్నెలా మామువుల్లిచ్చుకుంటాడు- యిదేరా బాబూ నాయం- కులవృత్తన్నారు పూర్వం- అయ్యజేసిన ఉజ్జోగం కొడుక్కి రావడం నాయం-"


"అయితే బుబూ! మీరు చెప్పిందాని పెకారం దొంగకొడుకు దొంగవుతానంటే ఒప్పుకోరేం సార్?" కానిస్టేబులడిగేడు-

"అది మాత్రం ఒప్పుకోరు! ఒప్పుకొంటే పోలీసోడివి నువ్వుండవు- పోలీసోడు లేకపోతే న్యాయస్థానాలుండవు. లాయరోళ్లుండరు-పొచ్చులూ, అబద్దాలూ ఉండవు. లిటిగేసన్లుండవు కోర్టులెత్తే- అయినేకపోతే గోర్మెంటోల్లుండరు- ఆడునేకపోతే మంత్రుండడు- ఆడునేకపోతే రాజ్యమే ఉండదు- రాజ్యమేనేకపోతే పెజలే ఉండరు- పెజలేనేకపోతే ప్రెపంచమే ఉండదు- అందుకు దొంగలుండాలి- ఆల్లని పట్టుకోందుకి నువ్వుండాల పోలీసూ.. అయితే ఎవురు దొంగలు, ఎవరు దొరలూ అంటావా?"

"మరడగనా సార్?"

"అదుగో నా బస్సు పారొచ్చింది. ఆకత మరోపాలి జెప్తాలే!"






కవులకూదర్జీలకూ
పంచాంగ కర్తలకు పత్రికల వాళ్లకూ
పండుగ ముందే వస్తుంది
పండుగ నాటికి వెళ్ళిపోతుంది
సిరుల కల అందరిదీ ఒకటే
దారిద్ర్యం మటుకు ఎవరిది వారికే
చీకటిలో దేవులాట
చీకటి దేవుళ్లాట
చాకిరేవులో గాలికి బట్టలారి ఆడుతుంటే
అంతా కేరింతలు కొడుతూ
స్వేచ్ఛా నృత్యం చేస్తూ
ఏదో ఆనందోత్సవంలో పాల్గొనట్లుంటుంది
ఉతికి ఆరేసిన బట్టలైనందున
దాలి గుంటలో కుక్క నయం
నూతిలో కప్ప మేలు
బైరిగాడి గుడిసెలో పంది మెరుగు
రెడ్డిగారి చావిట్లో
మాళీ పడ్డ పని మరీ హాయి
శీతోష్ణశైత్యాదుల కతీతం వాటి బ్రతుకు
మందిలో మనిషిని, మధ్య తరగతి వాణ్ణి
నేనే నా అంతటి వాణ్ణి
    ఆశలను నిత్య నూతనంగ ఉంచుకుంటున్న
ఎపుడూ ఉగాది చేసుకుంటున్న వాణ్ణి
న్యాయాన్ని నల్లకోటులోను
ప్రాణాన్ని తెల్లకోటులోనూ దాచిన వేళ
ఉగాదిని వెతుక్కుంటున్న వాణ్ణి.

కొమ్మన రాధాకృష్ణ